క్లుప్తంగా

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

మల్కాపురం: జీవీఎంసీలోని పలు విభాగాల్లో పని చేస్తున్న కార్మికులకు పనికి తగ్గ వేతనాలు లభించడం లేదని సీఐటీయూ నాయకుడు ఆర్. లక్ష్మణమూర్తి అన్నారు. మల్కాపురం దరి వెంకన్నపాలెంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం మల్కాపురం జోన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణమూర్తి మాట్లాడుతూ పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు తగిన వేతనాలు అందడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పథకాలు కూడా అందడం లేదని .. అరకొర వేతనాలతో ఎలా జీవించాలని వాపోయారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీసం రూ. 26 వేల జీతం చెల్లించాలి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

మల్కాపురం: జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్ ప్రాంతంలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దుర్గానగర్ ప్రాంతానికి చెందిన ఆరు గురు భవన నిర్మాణ కార్మికులు పేకాట ఆడుతున్నట్టు శుక్రవారం మల్కాపురం పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ గొలగాని అప్పారావు ఆదేశాలతో సిబ్బంది ఆ ప్రాంతానికి వెళ్లి పేకాడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ17,5,50 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న జెడ్సీ, కార్పొరేటర్

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధిలోని క్రాంతినగర్ గ్రామంలో శుక్రవారం ఫ్రైడే–డ్రైడేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జోనల్ కమిషనర్ బి.రాము, 63వ వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా మాట్లాడుతూ ప్రజలకు సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధుల కట్టడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం, మంగళవారం ఇంట్లో అత్యవసరానికి అవసరమైన నీటిని ఉంచుకుని, మిగిలిన నీటి పాత్రలను ఖాళీ చేస్తే సీజనల్ వ్యాధుల కారక దోమల నుంచి రక్షణ పొందవచ్చునన్నారు. ప్రజలు వ్యర్థాలను తడి–పొడి చెత్తగా ఇంటి వద్దే వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతోనే వ్యాధులను నివారించవచ్చునని, ప్రజలంతా ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా విభాగం ఇన్‌చార్జి డి.రవికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఏఎన్‌ఎంలు, ఆర్పీలు, శానిటరీ సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల నిరసన



కార్మికులతో మాట్లాడుతున్న ఏఎంహెచ్‌వో అప్పలనాయుడు


గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు పారిశుధ్య కార్మికులు గోపాలపట్నం బంక్ వద్ద శుక్రవారం ఉదయం నిరసన చేపట్టారు. అనారోగ్యంతో గురువారం పారిశుధ్య కార్మికురాలు గౌరి మృతి చెందడంతో కార్మికుల్లో ఆందోళన మొదలయింది. కార్మికురాలు మృతి చెందిన విషయం తెలిసినా జోన్–8 అధికారులు కనీసం సానుభూతి కూడా చూపలేదని కార్మికులు వాపోయారు. తమపై అజమాయిషీ చెలాయించి పనులు చేయించుకునే అధికారులు.. కార్మికులు మృతి చెందితే ఎవరూ కనిపించలేదని వాపోయారు. కార్మికులు నిరసన తెలుపుతూ ఉదయం విధులను బహిష్కరించారు. విషయం తెలుసుకున్న జోన్–8 ఏఎంహెచ్‌వో అప్పలనాయుడు వచ్చి కార్మికులతో మాట్లాడారు. కష్టకాలంలో ఎవరూ కనపడరని ఆయన ముందు వాపోయారు. కార్మికులకు అండగా ఉంటానని తెలిపారు. ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

వాటర్ వర్క్స్ కార్మికుల కన్నెర్ర

- వేతనాలు పెంచాలని మెరుపు సమ్మె
- ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్
- పంపుహౌస్ వద్ద నిరసన గళం
- తాగునీటికి సరఫరాకు బ్రేక్
- పశ్చిమ వాసులకు తాగునీటి కష్టాలు
- కార్మికుల గోడు పట్టించుకోని యంత్రాంగం

జీవీఎంసీ వాటర్ వర్క్స్ (అవుట్ సోర్సింగ్) కార్మికులు మెరుపు సమ్మెకు దిగారు. వేతనాల పెంపు హామీని అమలు చేయకపోవడంపై కన్నెర్ర జేశారు. గురువారం అర్ధరాత్రి నుంచి కార్మికులంతా విధులు బహిష్కరించారు. దీంతో రిజర్వాయర్లను నీటితో నింపేవారు కరువయ్యారు. ఆ ప్రభావం తాగునీటి సరఫరా పై పడింది. తమ న్యాయమైన డిమాండ్ సాధన కోసం సమ్మె చేపట్టిన వాటర్ వర్క్స్ కార్మికులంతా శుక్రవారం ఉదయం పంపు హౌస్‌ల వద్ద నిరసనకు దిగారు.

– విశాఖ విద్య



మర్రిపాలెంలోని ఓవర్ హెడ్ ట్యాంక్

జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం ఏపీఎస్ఈబీ కాలనీ వద్ద బ్లాక్–24 రిజర్వాయర్ ప్రధాన గేటు మూసివేసి కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. వేతనాల పెంపు తక్షణమే అమలు చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పశ్చిమ నియోజకవర్గంలోని అన్ని రిజర్వాయర్ల వద్ద అవుట్ సోర్సింగ్ కార్మికులు ఆందోళన చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఇంకెన్నాళ్లు మోసపోవాలంటూ కౌన్సిల్ పెద్దలు, జీవీఎంసీ అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

తాగునీటి సరఫరాకు బ్రేక్

జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం ఏపీఎస్ఈబీ కాలనీ(బ్లాక్–24)లో ఉన్న రిజర్వాయరు ఎస్‌ఏడీ సమీపంలోని ఆరు వార్డుల ప్రజానీకం తాగునీటి అవసరాలు తీరుస్తోంది. రైవాడ, తాటిపూటి, గోస్తనీ రిజర్వాయర్ల నుంచి నీటిని పైపులైన్లు ద్వారా తీసుకొచ్చి ఇక్కడ నిల్వ చేస్తారు. 1080 కిలో లీటర్ల సామర్థ్యం గల రిజర్వాయరు (కిలో లీటరు అంటే లక్ష లీటర్లు అన్న మాట) అందుబాటులో ఉంది. ఇక్కడ నుంచి ఎగువ ప్రాంతంలో ఉన్న బ్లాక్–23 రిజర్వాయరుకు 700 కిలోలీటర్లు, ఇందిరానగర్‌లో వెయ్యి కిలోలీటర్లు, లక్ష్మీనగర్–ఎఫ్ వద్ద 50 కిలో లీటర్లు, ఇ బ్లాక్ వద్ద 16 కిలో లీటర్లు, సీడీ బ్లాక్ వద్ద 160 కిలో లీటర్లు, రామకృష్ణ నగర్ వద్ద 200 కిలోలీటర్లు పంపుహౌస్ ద్వారా ట్యాంకుల్లో నిల్వ చేసి పరిసర కాలనీలకు ఇక్కడ నుంచే తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం కార్మికులంతా సమ్మెలో ఉండడంతో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



బుచ్చిరాజుపాలెం రిజర్వాయర్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజానీకానికి కష్టాలు

ప్రతీ రోజూ తెల్లవారు జాము 4 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక్కో ఏరియాకు 45 నిమిషాల చొప్పున తాగునీటిని సరఫరా చేస్తున్నారు. గురువారం అర్ధరాత్రి నుంచి కార్మికులు సమ్మెలో ఉండడంతో రెగ్యులర్ సిబ్బందితో రిజర్వాయర్లలో ఉన్న నీటిని శుక్రవారం కాలనీలకు సరఫరా చేశారు. అయితే, రిజర్వాయర్ల నుంచి పంపుహౌస్‌లకు నీటి సరఫరా ఆగిపోవడంతో శనివారం నుంచి ప్రజానీకానికి తాగునీటి కష్టాలు ఎదురయ్యే పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం నీటి సరఫరా నిలిచిపోతే తాగునీటికష్టాలు తప్పవని ప్రజానీకం ఆందోళన చెందుతున్నారు.

23 ఏళ్లుగా చేస్తున్నా ..



జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగంలో 23 ఏళ్లుగా పంపుహౌస్ హెల్పర్‌గా పని చేస్తున్నాను. నెలకు రూ.13 వేలు జీతం వస్తోంది. వాటితో ఇల్లు ఎలా గడపాలి. పిల్లలను ఎలా చదివించుకోవాలి. చాలీ చాలని జీతాలతోనే ఇంత కాలం గడుపుతున్నాం. జీతం పెంచుతామని మాట ఇచ్చిన అధికారులు ఇప్పుడేమో సాంకేతిక సమస్య అంటూ మెలికపెట్టడం ఎంతవరకు సమంజసం.

– దొడ్డి సతీష్

పథకాలు నిలిపేశారు



బుచ్చిరాజుపాలెం బ్లాక్‌లో పంపుహౌస్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాను. మాకు ఇచ్చేదే అరకొర జీతం. దానికి సీఎఫ్ఎంఎస్ ఐడీ లింకు పెట్టడంతో మేమేదో ప్రభుత్వ ఉద్యోగులమన్నట్టుగా సంక్షేమ పథకాలు ఆపేస్తున్నారు. దీనిపై మేము జీవీఎంసీ పెద్దలకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా, మా గోడు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా మా జీతాలు పెంచాలి.

– పీలా రాజేష్

నిరవధిక సమ్మెకు సిద్ధం



జీవీఎంసీ తాగునీటి విభాగంలో రిపేర్ వర్కర్‌గా పని చేస్తున్నాను.మాకు జీతాలు పెంచాలని జీవీఎంసీ కౌన్సిల్‌లో తీర్మానం చేస్తే ఎంతో సంబరపడ్డాం. కానీ, ఆ తీర్మానం అమలుకు నోచుకోవడం లేదు. జీతాలు పెంచుతామని అధికారులు రాత పూర్వకంగా కూడా హామీ ఇచ్చారు. కానీ, ఇంతలోనే ఏమైందో హామీ మాత్రం అమలు కావడం లేదు. జీతాలు పెంచకపోతే నిరవధిక సమ్మె చేస్తాం.

–అప్పలనాయుడు

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం




91, 92 వార్డుల నాయకులు, కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న మళ్ల విజయ ప్రసాద్

- ప్రజలకు అండగా ఉందాం
- నైతిక విలువ లేని నాయకులకు బుద్ధిచెబుదాం
- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్


గోపాలపట్నం: పశ్చిమ నియోకవర్గ ప్రజలకు అండగా ఉందాం.. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదామని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ పిలుపునిచ్చారు. బాజీ జంక్షన్‌లోని ఓ ఫంక్షన్ హాలులో శుక్రవారం 91, 92 వార్డుల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైతిక విలువలు లేని వారికి ప్రజల్లో స్థానం లేకుండా చేయాలన్నారు. పార్టీకి చేటు చేసేలా పని చేసిన వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పశ్చిమ నియోజకవర్గ తొలి ఎమ్మెల్యేగా తనను గెలిపించిన ప్రజలకు ఎప్పుడూ అండగా ఉంటానని చెప్పారు. అందుకే ఇక్కడి ప్రజలతో తనకు విడదీయలేని బంధం ఏర్పడిందన్నారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి ఆశీర్వాదంతో రాజకీయాల్లోకి వచ్చానని.. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీలో కొనసాగుతున్నానని తెలిపారు. తాను వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తోనే ఉంటానని స్పష్టం చేశారు. వార్డు స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. భవిష్యత్తులో వార్డుల వారీగా సమావేశాలు ఉంటాయన్నారు. ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపాలన్నారు. బాబూ ష్యూరిటీ... మోసం గ్యారంటీ అనే కార్యక్రమం త్వరలో చేపట్టబోతున్నామన్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజల్ని కలవాలని, ప్రభుత్వ పథకాలు ఏమిచ్చారు.. ఏమి ఇవ్వలేదో వివరించాలన్నారు. గత ప్రభుత్వంలో ఏవిధంగా ఉంది. ఈ ప్రభుత్వంలో ఏవిధంగా ఉందో ప్రలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని తెలిపారు. అక్రమ కేసులు పెడతారని ఆందోళన చెంద వద్దని మనకు లీగల్ సెల్ ఉందని భరోసా ఇచ్చారు. యువన విభాగం రాష్ట్ర కార్యదర్శి దొడ్డి కిరణ్, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు మేడిది బాజీ నాయుడు, 92వ వార్డు అధ్యక్షుడు గొర్లె అప్పలస్వామి నాయుడు, ఆళ్ల పైడిరాజు, చుక్క పైడిరాజు రెడ్డి 91, 92 వార్డుల అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృథా.. పట్టదా..

- తాటిపూడి పైప్‌లైన్ లీకేజీ
- వృథాగా పోతున్న తాగునీరు
- ఫిర్యాదు అందినా సిబ్బంది మొద్దునిద్ర



గోపాలపట్నం తాటిపూడి పైప్‌లైన్ లీకవుతున్న నీరు




తాటిపూడి పైప్‌లైన్ లీకేజీనీరు పోయేందుకు తవ్విన కాలువ

గోపాలపట్నం: గోపాలపట్నం రైతు బజారులో పైప్‌లైన్ లీకేజీ అవుతోంది. లీకేజీపై ఈ నెల 3న రైతు బజారు ఎస్టేట్ అధికారి తాటిపూడి పైప్‌లైన్ ఏఈకి ఫిర్యాదు చేశారు. దీంతో మరమ్మతులు చేపడతామని తెలిపారు. తర్వాత లీకేజీ నీరు మురుగు కాల్వలోకి వెళ్లే విధంగా కాలువ తవ్వించి వదిలేశారు. ఇటీవల నీరు మరింత ఎక్కువగా వస్తుండడంతో ఇది చూసినవారు అధికారులకు ఇంత నిర్లక్ష్యమా అంటూ మండిపడుతున్నారు. రోజూ మంచినీరు వృథాగా పోతున్నా పట్టించుకోరా అని ప్రశ్నిస్తున్నారు.

దుకాణాల వల్లే

తాటిపూడిపైప్‌లైన్‌పై దుకాణాలు ఏర్పాటు చేయడం వల్లే ఒత్తిడికి లీకేజీ అవుతోందని చెబుతున్నారు. ఆ సమయంలో నీరు కలుషిత మవుతుందని వాపోతున్నారు. మాంసం దుకాణాలు, హోటళ్లు, స్వీటు దుకాణాలతో పాటు పల రకాల దుకాణాలు వాటి టాయిలెట్లు ఇందులోనే నిర్మించేశారు. ఈ వ్యర్థాలన్నీ తాటిపూడి పైప్‌లైన్ లోకే వెళ్తున్నాయని వాపోతున్నారు.



పైప్‌లైన్ బ్లాస్ట్ అయిన సందర్భంలో కూలిన గోడ(ఫైల్)

రాజకీయ అండదండలతో...

కూటమి నేతల అండదండలు ఉండడంతో దుకాణాలవైపు అధికారులు చూడడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ దుకాణ దారులు ఫుట్ పాత్‌లను కూడా వదలడం లేదు. రోడ్లపై నుంచే నడవాల్సి వస్తోందని పాదచారులు వాపోతున్నారు.

తాగునీటికి కటకట

- పారిశ్రామిక ప్రాంతంలో బోరుబావులే దిక్కు



మల్కాపురం మంచినీటి సరఫరా కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న కార్మికులు



కుళాయి రాకపోవడంతో కొండపైకి నీరు తీసుకు వెళ్తున్న మహిళ

మల్కాపురం: జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగంలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులు సమ్మె బాట పట్టారు. దీంతో పారిశ్రామిక ప్రాంతంలో పలు చోట్ల మంచి నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది.దీంతో కొండ వాలు ప్రాంత మహిళలు ఇబ్బంది పడ్డారు. మంచినీటి సరఫరా విభాగంలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులు జీతాలు పెంచాలని ఈ నెల 11న టూల్ డౌన్ ద్వారా నిరసన వ్యక్తం చేశారు. ఆ సమయంలో అధికారులు 15 రోజుల్లో పెరిగిన జీతాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అయినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆందోళన చెందిన కార్మికులు సమ్మె బాట పట్టారు. మల్కాపురం నీటి సరఫరా కార్యాలయంలో పని చేస్తున్న 32 మంది మల్కాపురంలోని మంచినీటి సరఫరా చేసే కార్యాలయం వద్ద ఆందోళన తెలిపారు. వీరు మల్కాపురం,ప్రకాష్‌నగర్,త్రినాథపురం,న్యూకాలనీ,కోరమాండల్,శ్రీహరిపురం,ఆర్‌కేపురం,జనతాకాలనీ తదితర ప్రాంత వాసులకు మంచినీటి సరఫరా చేస్తుంటారు.వీరు ఆందోళన బాట పట్టడంతో కొన్ని ప్రాంతాలకు మంచి నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. పర్మినెంట్ కార్మికులు పూర్తి స్థాయిలో నీరు సరఫరా చేయలేక పోయారు. దీంతో కొండ వాలు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.బిందె పట్టుకుని దిగువ ప్రాంతంలో ఉన్న బోరు బావి వద్దకు వచ్చి నీరు మోయాల్సిన పరిస్థితి వచ్చింది.

కొండపైకి నీరు మోసా..



మా ప్రాంతానికి మంచినీటి సరఫరా కాలేదు. దిగువన గల బోరు బావి వద్దకు బిందె పట్టుకుని వెళ్లి మోయాల్సి వచ్చింది.అవుట్ సోర్సింగ్ కార్మికులు సమ్మెలో ఉంటే పర్మినెంట్ వారు మంచినీటి సరఫరా చేయాల్సి ఉంది.కానీ వారు మా ప్రాంతానికి వచ్చి కుళాయిలు ఇవ్వకపోవడంతో ఇబ్బంది పడ్డాం. అధికారులు స్పందించి నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలి.

– పేర్ల మసేనమ్మ , దుర్గానగర్ కొండ ప్రాంతం

ఎదురు చూశాం



కార్మికుల సమ్మె వల్ల మల్కాపురం ప్రాంతానికి మంచినీరు సరఫరా జరగలేదు.దీంతో చాలా అసౌకర్యానికి గురయ్యాం. గతంలో మా ప్రాంతంలో బోరు బావులు ఉండేవి.ఇప్పుడు వాటిని తొలిగించారు.కుళాయిలు రాక,బోరుబావి లేక తాగు నీరు కొనుక్కోవాల్సిన పరిస్థితి కలిగింది.

–నూనెల మంగాదేవి, మల్కాపురం

మూలకు చేరిన తాగునీటి బోరు



చింతల్లోవ గ్రామంలో పనిచేయని తాగునీటి బోరు

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి చింతల్లోవ గ్రామస్తులు నీటి ఎద్దడితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్చి వీధిలోని తాగునీటి బోరు నెల రోజులుగా పనిచేయడం లేదు. దీనికి తోడు మంచినీటి సరఫరా విభాగం కార్మికులు సమ్మెకు దిగడంతో మంచినీటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తుందని స్థానికులు వాపోతున్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి బోరుబావిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా కేబుల్ తీగలు



గోపాలపట్నం ప్రధాన రహదారిపై పడి ఉన్న కేబుల్ తీగలు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డులో సీఎంఆర్ షాపింగ్ మాల్ సమీపంలో కేబుల్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. రాత్రి సమయంలో గుర్తు తెలియని వాహనం తగలడం వల్ల కేబుల్ తీగలు తెగి పడ్డాయి. అందులో ఒక తీగ మందంగా ఉండడతో తెగిపోకుండా ప్రమాదకరంగా వేలాడుతోంది. దీంతో ఇది చూసిన వారు వాహనదారులు ప్రమాదాల భారిన పడకుండా రాళ్లు పెట్టారు. శ్రీరామ్‌నగర్, ప్రశాంతినగర్ వెళ్లే అప్రోచ్ రోడ్డు వద్ద ఈ తీగ వేలాడుతుండడంతో రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రధాన రహదారుల్లో కేబుల్ తీగలు ఏర్పాట చేసే వారిపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని ప్రజల కోరుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు కేబుల్ ఆపరేటర్లకు, నెట్‌వర్క్ సంస్థలకు విద్యుత్ స్తంభాలు అద్దెకి ఇచ్చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జాతీయ సమ్మెను జయప్రదం చేయండి

తాటిచెట్లపాలెం: జూలై 9న నిర్వహించనున్న జాతీ య సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. 45వ వార్డు నరసింహనగర్‌లో శుక్రవారం మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ నాయకులు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కాంట్రాక్టు కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ కార్మికులకు, ప్రజలకు తీవ్ర నష్టం చేకూర్చుతోందన్నారు. మోదీ ప్రభుత్వం కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందని, వెంటనే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో 5 వేల మంది కార్మికులను కేంద్ర ప్రభుత్వం తొలగించిందని, ప్లాంట్ కార్మికులను చంద్రబాబు ప్రభుత్వం పోలీసులతో అణచివేస్తోందన్నారు. ఈ చర్యలన్నింటినీ నిరసిస్తూ జూలై 9న తలపెట్టిన జాతీయ సమ్మెలో కార్మికులంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జోన్ సెక్రటరీ ఒ.అప్పారావు, ప్రెసిడెంట్ ఎస్.శ్రావణ్‌కుమార్, సీఐటీయూ జిల్లా నాయకులు యు.ఎస్.ఎన్.రాజు, నాయకులు ఎన్.ప్రకాశరావు, వి.సీతాలక్ష్మి, రమణమ్మ, వెంకటలక్ష్మి, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.